




వికలాంగుల సంక్షేమానికి చర్యలు : కాకాణి

ప్రజాశక్తి -నెల్లూరు :విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 18 మంది వికలాంగులకు 18 లక్షలు విలువచేసే మోటరైజ్డ్ త్రిచక్ర వాహనాలను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి అక్బర్ అలీ, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ సుస్మిత పాల్గొన్నారు.



త్రిచక్ర వాహనాలు పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి

'మేకపాటి'కే జగన్ ఆమోదం..!

ఉదయగిరి నుంచి మేకపాటి కుటుంబానికే అవకాశం దక్కేలా కనిపిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మేకపాటి కుటుంబం ప్రత్యేకంగా భేటి అయ్యారు. మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజారెడ్డి సిఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఇటీవల ఉదయగిరి నుంచి వైసిపి టికెట్ ఆశిస్తున్న నేతలు వరుస కడుతున్నారు. తామంటే తామంటూ ప్రచారం చేసు కుంటున్నారు. మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఉదయగిరి పరి శీలకులుగా ఉన్నారు. ఉదయగిరి నేతలను తనవైపు తిప్పుకొని తానే అభ్యర్థినని చెప్పుకుంటున్నారు. వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డిలు తాము ఉన్నామని చెప్పుకుంటున్నారు. ఉదయగిరి నుంచి మేకపాటి కుటుంబ సభ్యులే రంగంలో ఉండేలా కనిపిస్తోంది. సిఎం మేకపాటి రాజారెడ్డిని ఇన్‌ఛార్జ్‌గా నియమించినట్లు తెలిసింది. అధికారికంగా ఒకటి, రెండు రోజుల్లో తేలనుంది..

- ❍సిఎంతో మేకపాటి కుటుంబం భేటి
- ❍ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా రాజారెడ్డి?
- ❍ఒకటి, రెండు రోజుల్లో అధికారిక ప్రకటన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఉదయగిరి రాజకీయాలకు మేకపాటి కుటుంబానికి విడదీయరాని బంధం ఉంది. 1983 నుంచి ఉదయగిరిలో మేకపాటి సోదరులు రాజకీయాలు నడుపుతున్నారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వైసిపి నుంచి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. అటు తరువాత ఇక్కడ నుంచి ఎవరు 2024 పోటీలో ఉంటారనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. తొలుత మేకపాటి కుటుంబానికే సిఎం జగన్ అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. తొలుత మేకపాటి రచనారెడ్డి అటు తరువాత ఆదాల వంశీకృష్ణారెడ్డి పేర్లు బయటకొచ్చినా ప్రస్తుతం మేకపాటి రాజమోహన్‌రెడ్డి చిన్న తమ్ముడు మేకపాటి రాజారెడ్డి పేరు ముంద ుకొచ్చింది. ఆయన బెంగుళూరులో కాంట్రాక్టరు, వ్యాపారవేత్తగా ఉన్నారు. ఉదయగిరి ప్రాంతంలో మేకపాటి కుటుంబానికి 40 సంవత్సరాల చరిత్ర ఉంది. 1983 నుంచి మేకపాటి రాజమోహన్‌రెడ్డి కుటుంబం ఉదయగిరిలో తమ ప్రాభల్యం చూపుతోంది. తమ కుటుంబం నుంచి ఉదయగిరి చేజారు తుందని భావించిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఏప్రిల్‌లో సిఎం జగన్‌ను కలిసి సందర్భంగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె, ఆదాల రాఘవరెడ్డి కోడలు ఆదాల రచనారెడ్డిను ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈ విషయమై ఏప్రిల్ 24న హైదరాబాద్‌లో ఆ కుటుంబం కూర్చొని మాట్లాడుకున్నట్లు తెలిసింది.



సిఎంను కలిసిన మేకపాటి కుటుంబం

రచానారెడ్డి, ఆదాల వంశీకృష్ణారెడ్డి ఇద్దరు విముఖత చేసినట్లు తెలిసింది. ఉదయగిరిలో మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి నేనంటే నేను అంటూ పోటీలో ఉన్నారు. తమకు సిఎం చెప్పారంటే తమకు చెప్పారని ప్రచారం చేసుకుంటున్నారు. మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఒకడగు ముందుకేసి ఉదయగిరిలో తమ ప్రాభల్యం పెంచుకోడానికి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ముఖ్యమంత్రి తమ కుటుంబానికే అవకాశం ఇస్తానని చెప్పారని అలాంటి సమయంలో ఎందుకు టికెట్ వదులుకోవాలని ఉద్దేశంతో తన సోదరుడు మేకపాటి రాజారెడ్డితో మాట్లాడి రంగంలోకి దింపుతున్నట్లు తెలిసింది. ఇప్పుడు నియోజకవర్గాన్ని వదిలేస్తే 40 సంవత్సరాల చరిత్ర కనుమరుగవుతుందని పోటీ చేయాలని మేకపాటి కుటుంబం ఉన్నట్లు సమాచారం.

సిఎంతో 'మేకపాటి' కుటుంబం భేటీ..!

. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మేకపాటి కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం తాడేపల్లిలోని సిఎం నివాసంలో కలిశారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజారెడ్డి కలిసిన వారిలోఉన్నారు. ఉదయగిరి నుంచి తాము పోటీలో ఉంటామని, అవకాశం కల్పించాలని సిఎంను కోరినట్లు తెలిసింది. గతంలో ఇచ్చిన హామీలో భాగంగా మేకపాటి రాజారెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించడానికి సిఎం ఒకే చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు తెలిసింది. మేకపాటి కుటుంబానికి వ్యతిరేకంగా మెట్టుకూరు ధనుంజయరెడ్డి అనుచరులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తు న్నారు. ఇటీవల కావలికి వచ్చిన సిఎం వద్ద ఇదే విషయం ప్రస్తావించినట్లు తెలిసింది. ఉదయగిరి రాజకీయ వేడెక్కింది. ఎప్పుడు ఎలా మారుతుందో చూడాలి. మేకపాటి కుటుంబం మాత్రం ఉదయగిరిని వదులుకోడానికి సిద్ధంగా లేదని తెలుస్తోంది. ఇదే సమయంలో తమకు ఇవ్వాలంటూ కొందరు అభ్యర్థులు వేగం పెంచారు. సిఎం ఏం చేస్తారో చూడాలి.

ఐక్యపోరాటాలకు సిఐటియు సన్నద్ధం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : కార్మికుల హక్కులను హరించే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తూ పెట్టుబడిదారుల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తున్నాయని,ఈ విధానాలను ఎదిరించేందుకు సిఐటియు ఐక్యపోరాటాలకు సన్నద్ధమవుతుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు తెలిపారు. మంగళవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం, మేడే మాసోత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతం నుంచి పప్పుల వీధి, వాటర్ ట్యాంక్ పార్కు వరకు కార్మికులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగసభకు సిఐటియు నగర అధ్యక్షులు అత్తిమూరు శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ బహిరంగ సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు అదానికి అమ్ముడుపోయాయన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మిక వర్గాన్ని చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రం ఓ పథకం ప్రకారం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేవలం 4 కోడ్లుగా మార్పు చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుందన్నారు. అందులో భాగంగా ఫిక్సడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కేంద్రం అమలు చేయాలని భావించిన మూడు వ్యవసాయ నల్లచట్టాలను రైతులు పోరాటం చేసి అడ్డుకుందన్నారు. ఈ క్రమంలో చట్టాలను అమలు చేయడంలేదంటూ కేంద్రం రైతులకు నమ్మబలికిందన్నారు. ప్రస్తుతం ఈ నల్ల చట్టాలను పరోక్షంగా అమలు చేసేందుకు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తుందన్నారు. అలాగే జరిగితే దేశంలో ఆహార సంక్షోభం ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేందుకు కార్మిక వర్గం ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని కార్మిక వర్గాన్ని చైతన్య పరిచి మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అటువంటి పోరాటంలో జిల్లా కార్మికులు కీలక భూమికను పోషించాలని పిలుపు నిచ్చారు.



సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు నాయకులపై కేసులు బనాయించినా చెదరని ఆత్మ విశ్వాసంతో కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి సిఐటియు కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా నగరంలో ఇటీవల నిర్వహించిన పలు పోరాటాలను వివరించారు. సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు అత్తిమూరు శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడిలో ఉండే కార్మికులకు ఆట విడుపు కోసం మేడే రోజు నుంచి మే 30వ తేది వరకు మేడే మాసోత్సవాలు నిర్వహించామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా కార్మికులకు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిభను కనపరచిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. తొలుత 16వ డివిజన్ ప్రాంతానికి చెందిన కళాకారులతో కోలాట ప్రదర్శన, ప్రజానాట్యమండలి కళాకారులతో గీతాలాపన, 9వ డివిజన్ ప్రాంతానికి చెందిన హమాలీ కార్మికులతో పండరి భజన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.వి.వి.ప్రసాద్, కె.అజయ్‌కుమార్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్, ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు మూలం ప్రసాద్, కాయం శ్రీనివాసులు, సిహెచ్ దామోదర్‌రెడ్డి, ఎం.అశోక్, పి.సుధాకర్, బి.రాంబాబు, డివైఎఫ్ఐ నాయకులు బి.పి.నరసింహా, ఐద్వా నాయకురాలు కత్తి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సామూహిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి- నెల్లూరు :ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఆపిదే లేదని ఎపి జెఎసి అమరావతి నెల్లూరు జిల్లా కార్యవర్గం ప్రకటించింది. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఒక్కరోజు ఉద్యోగుల సామూహిక నిరాహార దీక్ష కార్యక్రమాన్ని జిల్లా కమిటీ నిర్వహించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉద్యోగుల నిరాహార దీక్ష శిబిరంలో బైఠాయించి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. అమరావతి జేఏసీ జిల్లా అసోసియేట్ చైర్మన్ శరత్ బాబు ప్రధాన కార్యదర్శి ఓ వి ప్రసాద్ కార్యవర్గ సభ్యులు మురళీకష్ణ, చెంచు రామయ్య ,చిరంజీవి, బాబురావు, లక్ష్మీ నారాయణ ,సురేష్ బాబు, వెంకటరమణయ్య, చిన్నయ్య అమరావతి జెఎసి అనుబంధ సంఘాల సంఘాల ప్రతినిధులు ఉద్యోగులు పాల్గొన్నారు.

స్పీకర్‌గా 'తమ్మినేని' అనర్హుడు..!

టిడిపి నేతల విమర్శ

ప్రజాశక్తి -నెల్లూరు

శాసనసభ స్పీకర్‌గా రాజకీయాలకు అతీతంగా ఉండాల్సిన తమ్మినేని సీతారామ్ ప్రతిపక్ష నేతను నోటికొచ్చినట్లు మాట్లాడడం మంచిదికాదని ఆయన ఆ పదవికి అనర్హుడని టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్, చెమకుల కృష్ణ అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ స్పీకర్ ఒక పార్టీకి తొత్తుగా ఒక నాయకుడికి అండగా వ్యవహరించ కూడదన్నారు. తెలుగుదేశం పార్టీ నేత నారా చంద్రబాబు నాయుడు భిక్షతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన తమ్మినేని సీతారాం నువ్వు చూడటానికి నీ బాడీ లాంగ్వేజ్ నీ లాంగ్వేజ్ చూడటానికి నేల టికెట్ అమ్ముకునేలా ఉందన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ఉలవపాడు : వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో మంగళవారం మొత్తం 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరితో ముందుగా పుస్తక పఠనం చేపించారు. నీతి కథలు వ్రాయించారు. కుందుడు గుమ్మ అనే ఆటను ఆడపించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహు మతులు అందిస్తారు. ఆటల్లో అలసిపోయిన చిన్నారులకు దాత వెంకట నారాయణ చల్లటి సుగంధ పానీయం ఇప్పించారు.

నేల రాలిన మామిడి కాయలు

గుడ్లూరు :వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా మంగళవారం ఉరుములతో కూడిన గాలి వర్షం పడింది. మండలంలోని సాగుతున్న మామిడి తోటల్లో కాయలు నేలరాలినట్లు రైతులు తెలిపారు. మామిడి తోటల్లో కాపు లేక.. ఈ ఏడాది దిగుబడులు తగ్గిపోవడంతో దిగాలు పడ్డ రైతులకు గాలి దుమారం బాగా దెబ్బ కొట్టింది. మరో వారం రోజుల్లోగా కాయలు అమ్ముకోవడానికి సిద్ధ పడుతున్న రైతులకు గాలివాన తీరని నష్టం కలిగించింది.

వైసిపి పాలనలో అరాచకం : టిడిపి

ప్రజాశక్తి -కందుకూరు : వైసిపి నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్ర అభివద్ధిని గాలికొదిలేసి ప్రతిపక్ష పార్టీ నాయకులమీద దాడులుచేయడం, అరాచకాలు సష్టించడమే ధ్యేయంగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేసిందని టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే విమర్శించారు. మంగళవారం మోషే ఇక్కడ మీడియాతో మాట్లాడారు. టిడిపి ప్రకటించిన ఫేజ్ -1 మేనిఫెస్టో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు.

మట్టి తరలింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని చుండి పెద్ద చెరువులో మట్టి తరలింపును వెంటనే నిలుపుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని చుండి, అయ్యవారిపల్లె గ్రామ పంచాయతీ సర్పంచులతో పాటు, ప్రజలు మంగళవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే మట్టి తరలింపును నిలిపివేసి తమకు న్యాయం చేయాలని అయ్యవారిపల్లె, చుండి సర్పంచులు డేగా వెంకటేశ్వర్లు, ఇరపని సతీష్‌తో పాటు, ప్రజలు ఇరిగేషన్ శాఖ ఇఇకి ఫిర్యాదు చేశారు. కలెక్టర్, కందు కూరు సబ్‌కలెక్టర్, తహశీల్దార్‌కు ఫిర్యాదు కాపీని అందజేసినట్లు చెప్పారు.

గృహ లబ్ధిదారులకు అవగాహన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :నూతనంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులందరూ గృహాలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని కందుకూరు డివిజన్ అభివృద్ధి అధికారి పద్మజ ఉద్యోగులకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో గృహనిర్మాణ శాఖపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో లబ్ధిదారుల వద్దకు వెళ్లి నిర్మించుకునేలా చూడాలన్నారు. ఎంపిడిఒ షేక్ రఫీక్‌అహ్మద్, ఎఇ చెన్ను శ్రీనివాసరావు, వర్క్ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీకి చర్యలు

నెల్లూరు : పెరుగుదలలేని, బరువు తక్కువగా ఉన్న చిన్నపిల్లలకు వైద్య సదుపాయం, పోషకాహారం అందించడానికి పటిష్ట ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ సంబంధిత అధికారులకు సూచించారు. పిల్లలలో పౌష్టికాహార లోపం, ప్రత్యేక అవసరాలుగల పిల్లలు , కంటి వెలుగు తదితర అంశాలపై కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ, ఐ సి డి ఎస్, విద్యాశాఖ అధికారులతో మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సమీక్షించారు.

కార్మిక చట్టాల పరిరక్షణకు ఉద్యమం

ప్రజాశక్తి-నెల్లూరు :దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం సమైక్యంగా వారి హక్కుల పరిరక్షణ కోసం..కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఉద్యమించాలని సిఐటియు సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం సిఐటియు 53 ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రూరల్ సిఐటియు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత సిఐటియు కోశాధికారి దేవతాటి సంపత్‌కుమార్, సిఐటియు పతాకావిష్కరణ చేశారు. సిఐటియు సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో సిఐటియు 40 వేల మంది సభ్యత్వం కలిగిన ఏకైక పెద్ద కార్మిక సంఘం అన్నారు. సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ మాట్లాడుతూ నిరంతరం కార్మిక హక్కుల సాధన కోసం పని చేస్తుందన్నారు. ఈ దేశంలో కార్మిక హక్కులను కాపాడుకుంటూ ఈదేశ సమైఖ్యతా సమగ్రతలను కాపాడు కొంటూ మతతత్వవిచ్చినకరశక్తుల ప్రమాదం నుండి దేశానికాపాడే కర్తవ్యంతో కార్మికులందరూ ముందుండాలని పిలుపునిచ్చారు. సిఐటియు రూరల్ కమిటీ నాయకులు ఎం. సుధాకర్, అంజిరెడ్డి, కష్ణ, ఎస్.కె చాంద్ భాషా, వెంకటేశ్వర్లు, ఆటో కార్మి కులు, భవన నిర్మాణ కార్మికులు, సిమెంట్ ముఠా కార్మికులు, రాళ్ల ముఠా కార్మికులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న డిఆర్ఓ నారాయణమ్మ

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : మానుగుంట

గుడ్లూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్విని యోగం చేసుకోవాలని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ప్రజలకి విజ్ఞప్తి చేశారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బసిరెడ్డిపాలెం సచివాలయం పరిధిలోని వెంకంపేట, చెంగిరెడ్డిపాలెం గ్రామాల్లో ఎంఎల్ఎ మండల అధికారులు, వైసిపి నాయ కులతో కలిపి గడప గడప కార్యక్రమాన్ని నిర్వహించారు. నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కారం చేస్తామని సంక్షేమ పథకాలు వారు ఉంటే వెంటనే తెలియజేసి పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రంగంపేటలో రక్షిత నీటి ద్వారా నీటిని కాలుష్యం లేకుండా పరిశుభ్రంగా ప్రజలకు అందజే యాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి రాజశేఖర్‌ను ఎంఎల్ఎ మహిధర్ రెడ్డి మందలించారు. ఎంపి డిఒ, తహశీల్దార్, మండల స్థాయి అధికారులు, వెంకంపేట సర్పంచ్ ,బసిరెడ్డిపాలెం సర్పంచ్, జెడ్‌పిటిసి బాపిరెడ్డి, ఎంపిపి పులి రమేష్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు :పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా నూతన కమిటీ ఏర్పడిన సందర్భంగా పిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖా ధికారిణి గంగాభవానిని మర్యాదపూర్వకంగా కలిసి పూలే టీచర్స్ ఫెడరేషన్ జిల్లా బాధ్యులను పరిచయం చేశారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు పదోన్నతులు మ్యాన్యువల్ పద్ధతిలో చేపట్టాలన్నారు. బదిలీల అనంతరం అన్నీ క్యాడర్ లకు పదోన్నతులు చేపట్టాలని, విద్యార్థుల విద్యా బోధనకు ఆటంకం కలగకుండా సబ్జెక్టుల వారీగా నెల నెలా పదోన్నతులు జరపాల న్నారు. ఉపాధ్యాయ బదిలీలకు శాశ్వత బదిలీ కోడ్ రూపొందించి ప్రతీ వేసవి సెలవుల్లో బదిలీలు జరపాలన్నారు. 2023 ఉపాధ్యాయుల బదిలీల్లో ఖాళీగా ఉన్న పోస్టులు అన్నీ బ్లాక్ చేయకుండా చూపాలని డిమాండ్ చేశారు.. రాష్ట్ర అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు, రాష్ట్ర కోశాధికారి తుమ్మారవి రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిలి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి వి రత్నం, జిల్లా అధ్యక్షుడు మక్తాల నరేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ జడపల్లి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, ఐ.కిషోర్, జిల్లా కార్యదర్శులు యు. జయరామయ్య,పల్లాపు రాము, రవిబాబు ఉన్నారు.

విద్యుత్ రంగ ప్రయివేటీకరణ సాగనివ్వం..

'సిఐటియు'తోనే కార్మిక వర్గాలకు రక్షణ - ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించాలని చేసే ప్రయత్నాలు సాగనివ్వనీయమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. మంగళవారం నెల్లూరు జిల్లాలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ముత్తుకూరు మండలంలోని ఎపి జెన్‌కో థర్మల్ ప్రాజెక్టు వద్ద సిఐటియు జెండా ఆవిష్కరించారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించడానికి కుయుక్తులు పన్నుతున్నాయన్నారు. ఎక్కడా అది సాధ్యం కాలేదన్నారు. మహారాష్ట్రతోపాటు అనేక ప్రాంత్రాల్లో కార్మికులు తిప్పికొట్టారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నియోజకవర్గంలోనే అది సాధ్యం కాలేదన్నారు. ప్రధాని, గవర్నర్లు, ముఖ్యమంత్రుల్లో ఎవరూ విద్యుత్ రంగం జోలికిరావడానికి భయపడుతున్నారన్నారు. ఎపి జెన్‌కో నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. బ్రహ్మదేవి సబ్ స్టేషన్ వద్ద ఎలక్ట్రిసిటి ఎంప్లాయి యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జూనియర్ లైన్‌మెన్స్ సచివాలయం, లేదా డిపార్ట్‌మెంట్ ఉద్యోగులా తేల్చాలన్నారు. వారి విధులకు సంబంధించి నిర్దిష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాయంత్రం నెల్లూరు నగరంలో సిఐటియు జిల్లా కార్యాలయాన్ని నర్సింగరావు ప్రారంభించారు. తొలుత నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి పప్పుల వీధి వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పప్పుల వీధిలతో జరిగిన బహిరంగ సభలో నర్సింగరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 11 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు జరగనున్నాయని, ఆగస్టులో ఈ 11 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వారం రోజులు మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపు నిచ్చామన్నారు. అందులో భాగంగా ఆగస్టు7నుంచి 15వ తేదీ వరకు దశల వారీ కార్యక్రమాన్ని రూపొందించి త్వరలో విధి విధానాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం రోజున నెల్లూరు నగరంలో సిఐటియు జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాను పాల్గొడం సంతోషకరంగా ఉందన్నారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :వలేటివారిపాలెంలో కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్‌కెఎండి రఫీ మంగళవారం వాహనాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగం గా ట్రైలర్, మోటారు క్యాబ్, మీడియం గూడ్స్ వాహనాలను నిలిపి డ్రైవర్లకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. పలువురు వాహన చోదకులకు లైసెన్సు లేని కారణంగా రూ. 50వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. లారీకి ట్యాక్స్, ఫిట్‌నెస్ లేని కారణంగా, ఆ లారీని వివిపాలెం పోలీస్‌స్టేషన్ నందు సీజ్ చేశారు. వాహనదారులు తమ వాహనాలకు విధిగా ట్యాక్స్ చెల్లించాలన్నారు. డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు.

గంధమహోత్సవానికి ఏర్పాట్లు

గుడ్లూరు : మండలంలోని తెట్టు దగ్గర స్థానికంగా ఉన్న సయ్యద్ సుల్తాన్ బీబా ఆవరణంలో జూన్ 1వ తేదీన జరగనున్న గంధ మహోత్సవానికి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.హిందూ ముస్లిం ఆధ్వర్యంలో ఏర్పడిన కమిటీ భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేసింది. విడిది చేసే భక్తుల కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. భారీ గేట్లు నిర్మించారు. సుల్తాన్ బీబీ సమాధిని దర్శనం చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలు పరిరక్షించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సుబ్బారావు తెలిపారు.

గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు


ప్రజాశక్తి-నెల్లూరు :పదో తరగతి సప్లమెంటరీ, ఎపిపిఎస్‌సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ వీసీ హాల్లో పదో తరగతి, ఎపిపిఎస్‌సి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ వెంకటనారాయణమ్మ మాట్లాడుతూ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరగనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 43 కేంద్రాల్లో 8400 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. . పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేయాలన్నారు. 3వ తేదీ నుంచి ఎపిపిఎస్‌సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు, వచ్చేనెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగే పరీక్షలు కనుపర్తిపాడు ప్రియదర్శిని కళాశాలలో నిర్వహించనున్నట్లు డిఆర్ఓ వెంకటనారాయణమ్మ తెలిపారు. నుడా విసి బాపిరెడ్డి, ట్రైనీ కలెక్టర్ సంజనాసింహ, అసిస్టెంట్ కమిషనర్ రామారావు, తహశీల్దార్ రాఘవేంద్రరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ రికార్డులు సిద్ధం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేలో రెండో విడత ఎంపిక చేసిన గ్రామాల్లో జూన్ 15 లోగా పక్కాగా భూ రికార్డులు (డిఎల్ ఆర్) సిద్ధం చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక తో కలిసి రీ సర్వే, మ్యుటేషన్లు, జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ మొదలైన రెవెన్యూ అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా పనుల్లో వేగం పెంచాలన్నారు.సర్వే ల్యాండ్ రికార్డుల ఏడి హనుమాన్ ప్రసాద్, ఆర్డీవోలు శీనా నాయక్, మలోల, కరుణ కుమారి, తహశీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జక్కా వెంకన్న వర్ధంతి

ప్రజాశక్తి-నెల్లూరు :సింహపురి కమ్యూనిస్టు యోధుడు మాజీ శాసనసభ్యులు జక్కా వెంకయ్య ఐదో వర్ధంతి కార్యక్రమాన్ని వేదాయపాళెం సమీపం లోని ప్రగతీ ఛారిటీస్ అనాధబాలల, మానసిక వికలాంగుల మధ్య నిర్వహించారు. మంగళ వారం జక్కా వెంకయ్య, పార్వతమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం అనాధపిల్లలకు, మానసిక వికలాంగులకు బిస్కెట్లను పంపిణీ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి దయాకర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యులు ఎ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

బిసిలకు రక్షణ చట్టం ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి -కందుకూరు : టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బలహీన వర్గాల రక్షణ కోసం చట్టం తీసుకువస్తుందని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడంపై రాష్ట్ర మేదరి బిసి సాధికార సమితి సభ్యులు భవనాశి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. మహానాడు సందర్భంగా రాజమండ్రిలో టిడిపి విడుదల చేసిన మేనిఫెస్టోలో బిసిలకు రక్షణ చట్టం తీసుకురావాలని పార్టీ అధ్యక్షుడు అచ్చెం నాయుడు, కొల్లు రవీంద్ర రెడ్డి సుబ్రమణ్యంతో సహా పలువురు బిసి నేతలు ప్రతిపాదించడం వెనువెంటనే చంద్రబాబు నాయుడు ఆమోదించడం హర్షణీయమన్నారు.

జక్కా వెంకయ్య ఆశయాలను కొనసాగిస్తాం..



ప్రజాశక్తి-కావలి : కావలి సిపిఎం కార్యాలయంలో కీర్తిశేషులు జక్కా వెంకయ్య 5వ వర్ధంతిని నిర్వహించారు.తొలుత జక్కా వెంకయ్య చిత్రపటానికి పూల మాల వేశారు. ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ జిల్లాలోని బుచ్చి మండలం, దామరమడుగులో 1930లో జన్మించారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి : కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్.విద్యార్థులు, కలం ట్రస్ట్ సభ్యులు సంయుక్తంగా మంగళవారం కాలేరిగుంట గిరిజన కాలనీలో పేదలకు మధ్యాహ్న భోజన పొట్లాలు అందించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల ఎన్.ఎస్. ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ పి.వి.సాయితేజ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచి ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా అభినందనీయ మన్నారు. అంతేకాకుండా కలాం ట్రస్ట్ ఈరోజికి 552వ అన్నదాన కార్యక్రమాలు చేపడుతుందని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మాట్లాడుతూ ఇక్కడున్న పేదవారికి కనీస సౌకర్యాలు లేనందున తాము ఇక్కడ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కాలేరి గుంట కాలనీలోని పేదవాళ్లకి కనీసం నివసించడానికి ఇళ్లు సరిగా లేవు. వర్షం వచ్చినా ఎండ వచ్చిన తలదాచుకోవడానికి ఎటువంటి నివాస గహం లేని వారు ఉన్నారు.అటువంటి వారికి తమవంతుగా సహాయం చేయడానికి మున్ముందు ఎన్నో కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య డిగ్రీకళాశాల ఎన్.ఎస్.ఎస్.విద్యార్థులు, కలాం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-కావలి : సిఎంగా ప్రమాణ స్వీకారం చేసి, నాలుగేళ్లు పూర్తియిన సందర్భంగా మంగళవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.తదుపరి కావలి ఎమ్మెల్యే నివాసం వద్ద నుంచి జెండా చెట్టు సెంటర్ వైపు నుంచి తహశీల్దార్ ఆఫీస్ వద్ద కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి బైక్ ర్యాలీగా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కేక్ కటింగ్ చేసి వైసిపి నాయకులకు తినిపి ంచారు. కార్యక్రమంలో వైసిపి మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్ఛార్జ్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం ఆంధ్రాబ్యాంక్ పైన ఉన్న అభినవ్ గ్రాండ్ మినీ ఫంక్షన్ హాల్ నిర్వాహకులైన పొన్నూరు. చెంచయ్య పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం వారి కుమారుడు పొన్నూరు. వెంకట హరీష్ మంగళవారం 100 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. అంతే కాకుండా కావలి పట్టణం జంగాల కాలనీలో గత కొన్ని నెలలుగా పక్ష వాతంకారణంగా మంచానికే పరిమితమైన మేళంగి.ఇర్మియా కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు బియ్యం వితరణ చేయడం జరిగింది. ఈ కార్య క్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, శానం.సువర్ణ, ఎం. అజిత్ బాబు, ఎంవిఎన్ ప్రసాద్ రావు, వలంటీర్లు అర్షియా, రేష్మ,కరిష్మా లు పాల్గొని సేవలందించారు.

యాత్రికులకు ఆర్టిసి ప్రత్యేక సదుపాయాలు

ప్రజాశక్తి-కావలి : అరుణాచలం, శ్రీశైలం ఇతర పుణ్యక్షేత్రాలను దర్శించగోరు భక్తులు, యాత్రికులకు ఆర్టిసి అనేక సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఎపిఎస్ఆర్టిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ఎప్పటిలాగానే అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్ల భక్తుల సౌకర్యార్థం ప్రత్యేబస్సు కేవలం 1400 రూపాయల ఛార్జితో పోను రాను అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం సదరు బస్సు జూన్ 3వ తేదీన బయలుదేరుతుందని తెలిపారు. వెళ్లదలచిన వారు వెంటనే టికెట్ రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. ప్రయాణికుల కోరితే ప్రత్యేక ప్యాకేజీలో తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు.

హాస్టళ్లలో వసతులు కరువు

ప్రజాశక్తి-కావలి : సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించకపోవడం వాటిని పున:నిర్మించకపోవడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సిఎం సాంఘిక సంక్షేమ గిరిజన సంక్షేమ హాస్టళ్లను నిర్మించేందుకు కొన్ని మరమ్మతులు చేసేందుకు కొన్ని కొత్త హాస్టళ్లలో నిర్మించేందుకు 1000 కోట్ల రూపాయలతో నాడు నేడు కార్యక్రమం నిర్వహించాలని చెప్పినప్పటికీ ఇప్పటివరకు దాని ఊసే లేదని తెలియజేశారు. జరుగుమల్లి విజయరత్నం, శివయ్య, పోలయ్య, లక్ష్మినర్సు, జెడ్డా వాసు పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : స్పందన అర్జీదారుల ఆకలి తీర్చడంలో ఆర్డిఒ వికె శీనానాయక్ చొరవ ప్రశంసనీయమని కావలి పట్టణ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్ బాషా పేర్కొన్నారు. ఆర్డిఒ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంనకు వచ్చిన అర్జీదారులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విశ్రాంత తహశీల్దార్ మొగల్ సిరాజ్ బేగ్ సహకారంతో మజ్జిగ, అన్నవరం శ్రీనివాసరావు సేవాసంస్థ నిర్వాహకులు హనుమకుమార్ సహకారంతో భోజన పొట్లాలు పంపిణీ చేశారు. కావలి రోటరీ క్లబ్ కు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చెన్నంశెట్టి దినేష్, రెడ్ క్రాస్ మేనేజర్ బిఎస్ ప్రసాద్, సభ్యులు పుష్పమిత్ర, రక్తకేంద్రం సిబ్బంది మధు సూదన్ రెడ్డి, వల్లూరమ్మ, బాలకోటయ్య, నచికేత్, వెంకటేశ్వరరెడ్డి, అనీల్పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఎఎస్పేట : మండలంలోని కావలి యడవల్లి గ్రామంలో మంగళవారం డాక్టర్ పి.రాంతున్నీసాబేగం సూచనల మేరకు డాక్టర్ బి.జ్యోతిరాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి లార్వా, జ్వరాలు సర్వే చెయ్యడం చేసినట్లు డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. నీళ్లు, టెంకాయ నీళ్లు ఎక్కువ తీసుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల లోపు పనులు ముగించి నీడ ప్రాంతంలో ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ ప్రాజెక్టులపై అవగాహన

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న బీటెక్ విద్యార్థులు కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రాజెక్టుల్లో భాగంగా ప్రతిభ కనపర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిపి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐ అండ్ డిఎస్ విద్యార్థులు వివిధ గ్రామాలకు వెళ్లి వివిధ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రాజెక్టులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రాజారెడ్డి, పరిపాలన అధికారి ఆర్.వి.రమణారెడ్డి, ఎఐడిఎస్ హెచ్ఒడి ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఛార్జి ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఇన్ఛార్జిగా మేకపాటి రాజగోపాల్ రెడ్డిని ప్రకటన వదంతులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో స్పందించిన మేకపాటి రాజగోపాల్ రెడ్డి వర్గీయులు మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో భారీ ఎత్తున బాణాసంచాలు పేల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో షేక్ గాజుల అంజుమన్ షఫ్రుద్దీన్, కౌన్సిలర్ సభ్యులు సుభాని నాయకులు ఆశోక్ కుమార్, జబ్బార్ మట్లా రామయ్య, లక్ష్మయ్య, ఇత్తడి రమణ, చక్రి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మహానాడులో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్రంలో మహిళలకు పలు వరాలు ప్రకటించిన సందర్భంలో తెలుగుమహిళ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మకూరు టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల.చంద్రారెడ్డి, పార్టీ మహిళా నేతలు సునీతమ్మ, రమణమ్మ, పద్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి మాట్లాడుతూ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ మహానాడులో చంద్రబాబు నాయుడు వరాల జల్లు కురిపించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : మహిళలకు ఆత్మగౌరవం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు స్నేహలత తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్ఛార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి ఆదేశాల మేరకు జాతీయ తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు కోవూరు నియోజకవర్గ తెలుగు మహిళా కమిటీ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు జూగుంట స్నేహలత, పార్లమెంట్ కార్యదర్శి యాకసిరి చెంచు రమణమ్మ, విడవలూరు తెలుగు మహిళా అధ్యక్షురాలు చలంచర్ల కామేశ్వరి, కళ్యాణ్, పొట్ల రాధాకృష్ణ, టిడి, టిడివి కుమార్, హరిబాబు, యాకసిరి వినయ్, పాటూరు పంచాయతీ వార్డ్ మెంబర్ పాటూరు ప్రసాద్, పుట్టెటి రవిచంద్ర, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.పద్మనాభరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సి ఉన్న ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చనందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రాష్ట్ర నాయకత్వం వారి పిలుపు మేరకు నెల్లూరు జిల్లా, ఆత్మకూరు తాలూక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వారు మంగళ వారం ఆత్మకూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మకూరు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులంటే ప్రభుత్వంలో భాగస్వాముల నీ, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించడం లేదని, సత్వరమే వారి డిమాండ్లన్నీ నెరవేర్చాలని వాటిలో ముఖ్య మైనవి తెలియజేశారు. సిపిఎస్ విధానాన్ని



మాట్లాడుతున్న పద్మనాభరెడ్డి

రద్దు పరచి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రతినెలా 1వ తేదీన జీతభత్యాలు ఇవ్వాలని, 11వ పిఆర్సి బకాయిలు, డిఎ అరియర్స్ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిఎస్సి ద్వారా నియమించిన ఉద్యోగులందరినీ రెగ్యులర్ చెయ్యాలని, కాంట్రాక్టు పద్ధతిలో నియ మించి ఉన్న వారందరినీ రెగ్యులర్ చెయ్యా లని డిమాండ్ చేశారు. అపస్ ఉద్యోగుల ఆత్మకూరు తాలూకా అధ్యక్షుడు అనీల్ కుమార్ మాట్లాడుతూ ఈ జూలైలో ఉద్యోగులకు రావాల్సి ఉన్న 12వ పిఆర్సి అమలు చేయడం కోసం కమిటీలు వేసి కాలయాపన చేయక నేరుగా ఉద్యోగుల ద్వారానే చర్చించి నిర్ణయం తీసుకోవాల న్నారు. ఉద్యోగుల దాచుకున్న సొమ్ములకు భద్రత కల్పించవలేనని, పదవీ విరమణ పొందిన రోజే ఉద్యోగులకు రావాల్సిన సొమ్ములు చెల్లించవలేనని డిమాండ్ చేశారు. ఎపిజిఇఎ అధ్యక్షులు ఖాదర్బాషా మాట్లాడుతూ 1993 కంటే ముందుగా నియమించిన ఎన్ఎంఆర్, డైలీ వేసేస్, కంటింజెంట్ ఉద్యోగులకు మెరుగైన జీతా లు ఇవ్వాలని తెలిపారు. ఉద్యోగులకూ రావాల్సిన డిఎలు అన్నీ, వాటి అరియర్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎపిజిఇఎ జాయింట్ సెక్రటరీ నాగరాజు, ఎఒ శ్రీనివాస్, డాక్టర్ రాకేష్, ట్రెజరీ ప్రసాద్ బాబు, సచివాలయ ఉద్యోగులూ రవూఫ్, ఎపిజిఇఎ కార్యవర్గ సభ్యులు, ఆపస్ ఉద్యోగులు, విఆర్ఒలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన మేకపాటి కుటుంబం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి, మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్రెడ్డి మంగళవారం మధ్యాహ్నం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా మెట్ట నియోజకవర్గాలకు మేలు చేకూరేందుకు నిర్మిస్తున్న హైలెవల్ కెనాల్ ఫేజ్ -1, 2 పనులకు సంబంధించి మునక ప్రాంత రైతులకు చెల్లించవలసిన నష్టపరిహారం ఇంతవరకు చెల్లించలేదని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతులకు నష్ట పరిహారం చెల్లింపు విషయమై జిల్లా కలెక్టర్కు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గానికి అవసరమైన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రికి విన్నవించినట్లు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి తెలిపారు.

ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి-కలిగిరి

ఎంపిడిఒ, ఎపిఒలు అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తూ ప్రతిపక్ష సర్పంచులకు, ఎంపిటిసికి అన్యాయం చేస్తున్నా రని మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. సర్పంచుల ప్రమేయం లేకుండానే ఫీల్డ్ అసిస్టెంట్ను ఎంపిక చేయడం, అనుమతులు లేకుండానే పనులు పెట్టడం సమంజసం కాదన్నారు. పలుసార్లు హెచ్చరించిన తీరు మారలేదని సమాధానం చెప్పే వరకు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తామని నాయకులు తెలిపారు. కలిగిరి ఎస్ఐ సూర్య ప్రకాశ్రెడ్డి నచ్చ చెప్పినప్పటికీ వినకపోవడంతో చివరకు ఎంపిడిఒ ఎపిఒ టిడిపి నాయకులు దగ్గరకు వచ్చి పైఅధికారుల సూచనల ప్రకారం వెళుతున్నామని సమాధా నం తెలిపారు. కార్యదర్శి కాకు మహేష్, సర్పం చులు వెంగపనాయుడు, వర ప్రసాద్ మాధవ, ఎంపిటిసి సిహెచ్ కమలమ్మ, నాయకులు సిహెచ్ తాతయ్య, జయరామిరెడ్డి, బొగ్గవరపు వేణు, చంద్రమౌళి తదితరులున్నారు.

ఉరుములతో కూడిన వర్షం

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం గంటపాటు ఉరుములు, ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. ఇటీవల నుండి ఎండల తీవ్రత అధికంగా ఉండి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో నమోదు ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో మండల ప్రజలు హాయిగా సేదతీరుతున్నారు. ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుకోవడంతో వృద్ధులు, పిల్లలు పాటుగా ప్రజలు ఆపసోపాలకు గురయ్యారు.

నేలకొరిగిన చెట్లు..

ప్రజాశక్తి-బిట్రగుంట : మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకోవడంతో బోగోలు, విశ్వనాథరావుపేట, కప్పరాళ్ల తిప్ప పలు ప్రాంతాలలో గాలి వానకు పెద్ద చెట్లు విరిగి విద్యుత్ లైన్పై పడటంతో విద్యుత్కి అంతరాయం ఏర్పడింది. రాత్రికి విద్యుత్ సరఫరా వస్తుందన్న నమ్మకం లేని సమయంలో విద్యుత్ శాఖ అధికారులు, లైన్మెన్ రమేష్ యుద్ధ ప్రాతిపదిక మీద చెట్లను తొలగించి కరెంటు సరఫరాను అందించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ లైన్మెన్ రమేష్ మాట్లాడుతూ ఇంటి ముందు ఉన్న చెట్లను విద్యుత్ తీగలకు తగలకుండా కొమ్మలను తొలగించి విద్యుత్కు అంతరాయం ఏర్పడకుండా ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.



రోడ్డుపై పడిన చెట్టును కొడుతున్న దృశ్యం

విరిగిపడిన ధ్వజస్తంభం

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని నారసింహాపురం (గుడిసిగుళ్ల) గ్రామంలో మంగళవారం వచ్చిన ఈదురు గాలుల బీభత్సంతో రామాలయం గుడి ఎదుట ఉన్న ధ్వజ స్థంభం నేలకొరిగింది. దాంతో గ్రామంలోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మండల గ్రామాలలో ఈస్తున్న ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కురిసిన వర్షంతో ఇండ్లు కుంగి భూ ప్రకంపనలు వాతావరణం ఏర్పడింది. దాంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పలుచోట్ల వృక్షాలు నెలకు వరిగాయి దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దాంతో గ్రామ ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-అల్లూరు : భానుడి భగభగతో తీవ్రంగా ఎండలు కాస్తున్న తరుణంలో మంగళవారం ఉన్నట్టుండి ఒక్కసారిగా గాలులు బీభత్సం సృష్టించడంతో పలు విద్యుత్ స్తంభాలు, టెంకాయ చెట్లు నేలకొరిగాయి. ఉక్కపోతతో అల్లాడుతున్న నేపథ్యంలో వాతావరణంలో పెనుమార్పులు సంభవించగా ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు విరిగిపడ్డ స్తంభాలు అలాగే టెంకాయ చెట్లను తీసివేయడం జరిగింది. ఈ కారణంగా విద్యుత్ కి అంతరాయం ఏర్పడింది.

బొల్లినేని ధనుష్కు అంతర్జాతీయ అవార్డు

ప్రజాశక్తి-కలిగిరి

ఉదయగిరి మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకటరామారావు కుమారుడు ధనుష్కు యంగ్ ఇండియన్ ఆచీవర్గా అంతర్జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. ఇండో ఆఫ్రికా ట్రేడ్ కౌన్సిల్ చైర్మన్గా ధనుష్కు అవార్డు రావడంపై ఉదయగిరి నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుబాయిలో అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్నేషనల్ ట్రేడ్ క్యాటగిరీలో అవార్డులు ప్రదానం చేయగా ధనుష్కు అవార్డు లభించింది.



అవార్డును చూపుతున్న బొల్లినేని ధనుష్

ఉపాధి హామీ పథకాలపై సమీక్ష

ప్రజాశక్తి-వరికుంటపాడు

వరికుంటపాడు మండల పరిషత్ కార్యాల యంలోని ఉపాధి హామీ కార్యాలయంలో మంగళ వారం ఉదయగిరి క్లస్టర్ ఉపాధి హామీ ఎపిడి గాయత్రీ దేవి ఉపాధి హామీ సిబ్బందితో పలు పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరికుంటపాడు మండలంలో రామాపురం, పంచాయతీలో రెండు చెరువుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ అమత్ సరోవర్ పథకం ద్వారా సుమారు రూ.20 లక్షలు తోటలచెరువుపల్లి చెరువుకు రూ.9.91 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పథకం ద్వారా చెరువులు అభివృద్ధి పరుస్తూ పరిసరాలు పరిశు భ్రంగా ఉండే విధంగా తీర్చిదిద్దడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. ఈ పథకాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని కూడా నియమించినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే ఆర్డబ్ల్యూఎస్ డిఇ లక్ష్మణరావు, అగ్రికల్చర్ ఎడి బాలాజీ నాయక్, డిఆర్పి సెట్ సిహెచ్ రమేష్ బాబుతో ఒక కమిటీ నియమించామన్నారు. ఈ కమిటీ అమృత్ సరోవర్ పథకం ద్వారా మంజూరైన చెరువులను పరిశీలించి భౌతికంగా అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా పరిశీలించి తుది నివేదిక కలెక్టర్కు అందజేస్తారని తెలిపారు. అనంతరం రాష్ట్ర కమిటీ మరియు కేంద్ర కమిటీ కూడా వచ్చి ఆ చెరువులను పూర్తిస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. ఈ అమృత సరోవర్ పథకంలో నేమ్ బోర్డు, ఫ్లాగ్ హార్వెస్టింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం హార్టికల్చర్ ద్వారా వరికుంటపాడు మండలంలో ప్రస్తుతం 24 ఎకరాలు పండ్ల తోటలో అభివృద్ధి పరచడానికి మంజూరు చేశామని, అందులో వరికుంటపాడు పంచాయతీలో నాలుగు ఎకరాలు మంజూరయ్యాయన్నారు. హార్టీకల్చర్ ద్వారా మంజూరైన రైతులు తక్షణమే ఫిట్టింగ్ పనులు ప్రారంభించాలన్నారు. ఇంకా మండలంలోని రైతులు ఎవరైనా హార్టికల్చర్ ద్వారా పండ్లతోట్లను పెంచుకొనుటకు సిద్ధంగా ఉండే రైతులు చిన్న సన్నకారు సర్టిఫికెట్ తో పొలం కాగితాలు తీసుకొని వచ్చి అప్లై చేసుకోవచ్చని తెలిపారు. తద్వారా పండ్ల తోటలు అభివృద్ధి పరుచుటకు నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. అంతేకాకుండా మండలంలో ఆధార్ సీడింగ్ ఇంకా పూర్తి స్థాయిలో సిబ్బంది పూర్తి చేయలేదన్నారు. దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి త్వరగా గ్రామాల్లోని ఉపాధి కూలీల ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలని తెలియజేశారు. భవిష్యత్తులో ఆధార్ సీడింగ్ ద్వారా ఉపాధి కూలీల వేతనాలు కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుందని అందువల్ల ప్రతిఒక్క ఉపాధి కూలీ తప్పనిసరిగా ఆధార్ సేడింగ్ చేసుకోవాలన్నారు. మండలంలో సుమారు 24 పంచాయతీలు ఉన్నాయని ప్రస్తుతం ఉపాధి హామీ సిబ్బంది మండలంలో కొరత ఉందని ముఖ్యంగా ఎపిఒ ఒక టిఎ ఒక కంప్యూటర్ ఆపరేటర్ మండలానికి అవసరం ఉందని తెలిపారు. సిబ్బంది కొరతను తీర్చి గ్రామా ల్లోని ఉపాధి హామీ పనులకు కొరత లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేయవలసిందిగా పలువురు ఎపిడి గాయత్రి దేవిని కోరారు. కార్యక్రమంలో ఎపిడి క్లస్టర్ టిఎ చెన్నయ్య, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాలు అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి

గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాతృత్వంతో రూ.5లక్షలు విలువ చేసే వైద్య పరికరాలను అందజేశారు. మంగళవారం గండిపాలెం పిహెచ్సి వైద్యాధికారి శివ కల్పన మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా ఇన్ఛార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి క్షయ లెప్రసీ ఎయిడ్స్ నియంత్రణ, ఆత్మకూర్ డివిజన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.వెంకట ప్రసాద్ హార్థిక కృషి పూర్తి తోడ్పాటుతో రూ.5లక్షల విలువైన మెడికల్ సామాగ్రిని అందించడం సంతోషదాయక మన్నారు. వైద్యశాలలో అవసరమైన కాన్పు టేబుల్ బేబీ వార్మర్ స్ట్రేచర్ నీటి శుద్ధి చేసే పరికరం బిపి ఆపరేటర్ ఫ్రిజ్ ఆటో క్లేవ్ లేబర్ టేబుల్ సెలైన్ స్టాండ్ వంటి అత్యవసర సామాగ్రిని అందజేశారన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ శివకల్పన డాక్టర్ వినీతా జిల్లా ఇంఛార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు కూడా చేయడం ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్బాషా సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని అప్పసముద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను స్థానిక ఎపిఒ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేసి ప్రభుత్వం ప్రకటించిన దినసరి కూలి రూ.272 కూలీలు పొందాలన్నారు. అదేవిధంగా అధిక వేసవి వల్ల ఉదయం 6 నుంచి 11 లోపు పనులను పూర్తిచేసుకుని కోరారు. పని ప్రాంతంలో టెంట్లను ఏర్పాటు తాగునీటి వసతి కల్పించాలని సిబ్బందికి సూచనలు సలహాలు చేశారు. త్వరలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కదిరినాయుడుపల్లి సమీపంలో నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై మంగళ వారం గేదెను తప్పించ బోయి కారు అదుపు తప్పి బోల్తా పడింది. కడప జిల్లా కాశినాయనమండలం వడ్లమాను గ్రామానికి చెందిన వారు శ్రీకాళహస్తికి వెళ్లి దైవదర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కారులో ప్రయాణి స్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చెట్లలోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని నందవరం సమీపంలో తెల్లరాయి లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి చెట్లలోకి దూసుకెళ్లింది. దుత్తలూరు మండలం నుండి చెన్నైకి అక్రమంగా తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లారీలో ఉన్న తెల్లరాయి రోడ్డుపై పడడంతో కొంతసేపు వాహనాల ట్రాఫిక్కు అంతరాయం కలిగింది.

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలో రవాణాశాఖ అధికారుల ఆదేశాల మేరకు కాలుష్యాన్ని నివారిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం నినాదంతో వాహనదారులకు ఆత్మకూరు మోటార్ వాహనాల ఇన్స్పెక్టర్ రాములు అవగాహన కల్పించారు. ప్రతి రోజు వాహనాలపై చెకింగ్ ఉంటుందని, వాహనదారులు తప్పనిసరిగా పొల్యూషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఎక్కువ పొగ వస్తున్న వాహనాలను రిపేరు చేయించుకొని రోడ్డు మీదకు రావాలని లేని పక్షంలో అపరాధ రుసుము విధిస్తామన్నారు. అధిక పొగతో వెళ్తున్న వాహనాన్ని సీజ్ చేసి, 15 వాహనాలకు అపరాధ రుసుము విధించామని పేర్కొన్నారు. వాహన దారు లు సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉం డాలని, మద్యం సేవించి వాహనం నడిపినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఎఎస్పేట

మండలంలోని గుంపర్లపాడు పంచాయతీ పరిధిలోని గొల్లపేట గ్రామంలోని సర్వే నెంబర్ 237/2, 237/3 221 223 230 234/1లో భూములు సుమారు 32 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూములను గ్రామానికి చెందిన కొందరు ఆక్రమణలకు పాల్పడి రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టాలు పొంది దర్జాగా సాగు చేసుకుంటున్నారని ఆ గ్రామానికి చెందిన దుడ్డు రాఘవులు, పులి ఓబుల్ రెడ్డి, పల్లాల రమేష్ , సయ్యద్ జమీర్లు తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లపేట గ్రామానికి చెందిన పల్లాల శ్రీనివాసులు రెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, శేషారెడ్డి అనే వారు భూస్వాములు, 237/2,3 సర్వే నంబర్లలో డిఫారం పట్టాగా ఉన్న భూమిని ఆక్రమించి అనుభవిస్తున్నారని ఆ భూమి పక్కనే ఉన్న, 471/1 చెరువు పంట కాలువను ధ్వంసం చేసి అక్రమించారని వారు తెలిపారు. గతేడాది ఈ ఆక్రమణల విషయంపై ప్రశ్నించినందుకు తమ కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచారని ఈ విషయం ఎఎస్పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి ఉన్నామన్నారు. ఈ మొత్తం భూమి 28.21 ఎకరాలు సొలస సత్యనారాయణ అనే వ్యక్తి పేరున గతంలో కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లు ఉండగా వాటిని ఒంగోలు ఆర్డిఒ కార్యాలయంలో 1993లో సీలింగ్ కింద ప్రభుత్వానికి స్వాధీనం చేసి ఉండగా సంబంధిత భూములకు పల్లాల వెంకటేశ్వర్లురెడ్డి ఆయన కుటుంబ సభ్యులు అక్రమంగా పట్టాదారు పాసు పుస్తకాలు సృష్టించుకున్నారని వారు తెలిపారు. గుంపర్లపాడు గ్రామానికి చెందిన జమీర్ అహ్మద్, ఓబుల్ రెడ్డి అను వారు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రెవెన్యూ అధికారులకు సీలింగ్ భూములకు సంబంధించిన పూర్తి ఆధారాలు సమర్పించి ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు చేపట్టలేదని వారు తెలిపారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు పల్లాల రమేష్ తెలిపారు. భూ ఆక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి భూస్వాముల నుండి ప్రభుత్వ భూమిని స్వాధీన పరుచుకొని గ్రామంలో భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. విషయమై తహశీల్దార్ను వివరణ కోరగా గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి తగు చర్యలు చేపడతామన్నారు.

గంగపట్నంలో బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని గంగపట్నం గ్రామంలో వెలసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సింహ వాహనంపై శ్రీ చాముండేశ్వరి అమ్మవారు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఉభయకర్తలుగా కొండూరు సూరారెడ్డి, పద్మావతి దంపతులు వ్యవకరించారు. కార్యనిర్వహణ అధికారి బండి శాంతయ్య, స్థానిక నాయకులు కొండూరు సుధాకర్ రెడ్డి,జనార్దన్ రెడ్డి, ఫణీంద్ర నాయుడు, అర్చకులు అనిల్ స్వామి, రామకష్ణ స్వామి, కిషోర్ స్వామి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని బోయల్ల చిరువెళ్ల సచివాలయంలో ఎంపిడిఒ సి.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. పాత ఫ్లెక్సీ స్థానాల్లో కొత్త ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సచివాలయం సేవలు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అలాగే వాలంటీర్లు అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసుల రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు షఫీ, శ్రీనివాస్, సంక్షేమ సహాయకులు సుబ్బారావు, ఇంజనీరింగ్ సహాయకులు హరీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి

ప్రజాశక్తి-కొడవలూరు

డిజిటల్ బోర్డ్ ద్వారా విద్యార్థులకు మెరుగైన బోధన అందించడం జరుగుతుందని హెచ్ఎండి ఓబులేసు తెలిపారు. నార్త్ రాజుపాలెం లోని హైస్కూల్ ప్లస్ (బాలికలు)లో గురువారం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమవుతున్నా యని హెచ్ఎం డి ఓబులేసు మంగళవారం ప్రకటనలో తెలిపారు. గతేడాది (2022- 23) విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ బాలికల కోసం ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రారంభించిన మొదటి ఏడాదిలోనే 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల అయినందున ఇంటర్ మొదటి సంవత్సరం చేరదలచిన బాలికలు వెంటనే చేరాలని కోరారు.

ప్రజలు మెచ్చే పాలన జగనన్నకే సాధ్యం

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన నాలుగేళ్ల పాలనలో ప్రతిపక్షాలు సైతం మెచ్చే సమర్ధ పాలన ప్రజలకు అందించారని, అలాంటి సంక్షేమ పాలన అందించడం దేశంలో ఒక్క జగనన్నకే సాధ్యమని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిగా సంతకానికి నాలుగేళు పూర్తయిన సందర్భంగా నెల్లూరులోని మేకపాటి నివాసంలో ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన జరిగిన మీడియా సమావేశంలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబ సంక్షేమ బాధ్యతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన ఎన్నికల మెనిఫెస్టోను చూసి ప్రతిపక్ష పార్టీలు ఎన్నో విమర్శలు చేశాయని, కానీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి గెలుపొందాక ప్రతి ఒక్క హామీని నెరవేర్చారన్నారు. ప్రతి పేదవాడిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సంక్షేమ పథకాలన అమలు చేస్తూ వారిని ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నారని, సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతిఒక్కరూ మరోమారు జగనన్న పాలననే కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని స్థానాల్లో వైసిపి విజయ కేతనం ఎగురవేస్తుందని తెలిపారు. కార్యమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపీ మేనిఫెస్టోతో మోసం

ప్రజాశక్తి-ఉదయగిరి : జగనన్న ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను కాపీ కొట్టి చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, దానిని ప్రజలు ఆదరించబోరని నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరి ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఎంపిపి అతిథి భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన కొనసాగి నాలుగేళ్లు పూర్తి చేసుకొని ఐదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరుపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ నాయకులు కార్యకర్తల సమక్షంలో భారీ కేకును కట్ చేశామన్నారు. నవరత్నాలతో పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి దని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి పెరుగుతున్న ప్రజాదరణ తట్టుకోలేక ప్రభుత్వం ఏర్పడిన నుంచి ప్రభుత్వంపై నారా చంద్రబాబు నాయుడు ఓర్వలేక అనేక విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానాడులో జగనన్న ప్రవేశపెట్టిన మేనిఫెస్టిన కాపీ కొట్టి ప్రచారం చేసుకుంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు సాధ్యం కానీ హామీలతో వస్తున్నారని రాష్ట్ర ప్రజలు నమ్మరని అన్ని వర్గాల ప్రజలతో పాటు రైతులను మోసం చేసిన ఏకైక ప్రభుత్వం టిడిపిని దుయ్యబట్టారునియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామాల నుంచి కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. జరిగిన బైక్ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న ఇరువురు కార్యకర్తలు స్వల్ప ప్రమాదానికి గురికావడంతో ఎండిఆర్ ఫౌండేషన్ తరపున ఆర్థికసాయం అందజేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో దుత్తలూరు మండల కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ చలమారెడ్డి గురువారెడ్డి, అంకినపల్లి ఓబుల్ రెడ్డి, వింజమూరు కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, ఎస్సిసెల్ నాయకులు గడ్డం హజరత్తయ్య, ఎంపిటి సిలు సర్పంచ్లు తదితరులున్నారు.

వైసిపి నాలుగు సంవత్సరాల పాలన

ప్రజాశక్తి-కలిగిరి : సంక్షేమం అభివృద్ధి రెండు కల్లుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి తెలిపారు. జగన్ పాలన పూర్తయి నాలుగు సంవత్సరాల సందర్భం గా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి శిరీష ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పలువురికి పెంచారు. నాలుగు సంవత్సరాల కాలంలో సచివాలయాలు, ఆర్బికెలు, అమ్మ ఒడి, పాఠశాలల అభివృద్ధి మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని చిరంజీవి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కంచెంరెడ్డి సుబ్బారెడ్డి, వి, కొండారెడ్డి, మాలపాటి వెంకటేశ్వర్లు, సతీష్, నోటి మల్లికార్జున్రెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

సిఎంకు అభినందనలు

ప్రజాశక్తి విడవలూరు : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో వైసిపి నాయకులు కార్యకర్తలు సిఎంకు అభినందనలు తెలుపుతూ పుండ్ల అచ్యుత్ రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, కాటంరెడ్డి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్చేసి సంబరాలు నిర్వహించారు. మండలంలోని ముఖ్య నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఎంపిపి భావనమ్మ మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రజా సంక్షేమ పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. దేశంలోనే సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందన్నారు. నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా విడవలూరు మండల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.